## విస్తారా విమానంలో సాంకేతికలోపం

- 20 నిమిషాలు గాల్లోనే చక్కర్లు కొట్టిన పైలట్
- మరో విమానంలో ప్రయాణికుల తరలింపు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 11 ( నమస్తే తెలంగాణ ) : శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి గురువారం సాయంత్రం టేకాఫ్ అయిన UK-880 విస్తారా విమానంలో టెక్నికల్ సమస్య తలెత్తింది. దీంతో పైలట్ 20 నిమిషాలపాటు గాల్లోనే చక్కర్లు కొట్టాడు. సాంకేతికలోపంతో అప్రమత్తమైన పైలట్ తిరిగి శంషాబాద్‌లోనే విమానాన్ని ల్యాండ్ చేశాడు. ఫ్లైట్‌లో 180 మంది ప్రయాణికులు ఉన్నారని, మెయింటనెన్స్ కారణంగానే అత్యవసర ల్యాండ్ అయినట్టు విస్తారా యాజమాన్యం ప్రకటించింది. ప్రయాణికులను వేరే ఫ్లైట్‌లో ఢిల్లీకి తరలించారు.

## ఉత్కంఠ రేకెత్తించిన ఎయిర్ ఇండియా

**తిరుచ్చిలో సురక్షిత ల్యాండింగ్**

చెన్నై, అక్టోబర్ 11: తమిళనాడులోని తిరుచ్చిలో ఓ ఎయిర్ ఇండియా విమానం ఉత్కంఠకు గురి చేసింది. తిరుచ్చి నుంచి షార్జాకు వెళ్లేందుకు 141 మంది ప్రయాణికులతో శుక్రవారం సాయంత్రం 5.45కు బయలుదేరిన బోయింగ్ 737 విమానంలో కొద్దిసేపటికే హైడ్రాలిక్ వ్యవస్థలో సాంకేతిక లోపం ఏర్పడింది. దీంతో విమానాన్ని తిరిగి తిరుచ్చి ఎయిర్‌పోర్టులో ల్యాండింగ్ చేయాలని నిర్ణయించారు. అయితే ల్యాండింగ్ గేర్ పనిచేయకపోవచ్చునని భావించి ఇంధనం ఖాళీ కోసం విమానాన్ని రెండు గంటలపాటు గాలిలో చక్కర్లు కొట్టించారు. తర్వాత బెల్లీ ల్యాండింగ్ చేయించాలని నిర్ణయించగా ల్యాండింగ్ గేర్ పనిచేయడంతో రాత్రి 8.15 గంటలకు విమానం సురక్షితంగా తిరుచ్చి ఎయిర్‌పోర్ట్‌లోనే ల్యాండ్ అయ్యింది.

# సోయా రైతుకు సర్కారు టోపీ!

- కేంద్రం కోటాలో కొనుగోలుకు మార్క్‌ఫెడ్ నిర్ణయం
- ఉత్పత్తి అంచనా 2.60 లక్షల టన్నులు..
- కొనుగోలుకు 56వేల టన్నులే అనుమతి
- మిగిలిన పంటపై చేతులెత్తేసిన రాష్ట్ర ప్రభుత్వం
- మ్యానిఫెస్టోలో ప్రకటించిన బోనస్ కూడా బోగస్సే
- పైగా పంట కొనుగోలుకు క్యాప్ నిబంధనలు
- ప్రభుత్వ నిర్ణయంపై సోయారైతుల ఆగ్రహం



ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు వచ్చిన సోయాబీన్

హైదరాబాద్/ఆదిలాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): మార్కెట్లో సోయాబీన్ ధర భారీగా పడిపోయింది. మద్దతు ధర క్వింటాలుకు రూ. 4892 ఉండగా మార్కెట్లో కేవలం రూ. 3500 నుంచి రూ. 4వేల లోపే ధర పలుకుతున్నది. ఎన్నికల సమయంలో పంట మద్దతు ధరకు అదనంగా రూ.450 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు బోనస్ సంగతి దేవుడెరుగు కనీసం మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు కూడా వెనకంజ వేస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**కేంద్రం కోటాలోనే కొనుగోళ్లు...**

సోయాబీన్ ధరలు పడిపోవడంతో పంట కొనుగోలుకు కేంద్రం అంగీకరించింది. కేంద్ర నిబంధనల ప్రకారం మొత్తం ఉత్పత్తిలో 25శాతం అనగా 56,550 టన్నుల సోయాబీన్ కొనుగోలుకు ఆదేశించింది. పంట కొనుగోలుకు మార్క్‌ఫెడ్ మొత్తం 37 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం అధికారులు 13 కేంద్రాలు ప్రారంభించి 50 టన్నుల సోయాబీన్ కొనుగోలు చేశారు. ఈ సీజన్‌లో సుమారు 4 లక్షల ఎకరాల్లో సోయాబీన్ పంట సాగు కాగా 2.60 లక్షల టన్నుల ఉత్పత్తి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. కేంద్ర ప్రభుత్వం 56వేల టన్నులు మాత్రమే కొనుగోలుకు ఆదేశించింది. అంటే మిగిలిన 2.04 లక్షల టన్నుల పంటను ఎవరు కొనుగోలు చేయాలనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. వాస్తవానికి మిగిలిన పంటను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలి. కానీ ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదు.

**బోనస్ హామీ... బోగసేనా ?**

ఎన్నికలకు ముందు సోయాబీన్ పంటలకు బోనస్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పొందుపరిచింది. నిరుడు మద్దతు ధర రూ. 3950 ఉండగా కాంగ్రెస్ పార్టీ రూ. 4400(రూ. 450 లేదా 11 శాతం బోనస్)లకు కొనుగోలు చేస్తామని ప్రకటించింది. ఈ లెక్కన ప్రస్తుతం సోయాబీన్ మద్దతు ధర రూ. 4892గా ఉండగా అదనంగా రూ. 450 బోనస్ కలిపి రూ. 5342కు కొనుగోలు చేయాలి. ఒకవేళ శాతం ప్రకారం లెక్కిస్తే రూ. 5430 ధరకు కొనుగోలు చేయాలి. కానీ ప్రభుత్వం ఏ ధరకూ కొనుగోలు చేయడం లేదు. అంతేగాక అసలే ధర లేక ఇబ్బంది పడుతున్న రైతులపై ప్రభుత్వం పిడుగు వేసింది. ఎకరాకు 6.52 క్వింటాళ్లను మాత్రమే కొనుగోలు చేయాలని నిర్ణయించింది. దీంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ క్యాప్ నిబంధనపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి కోతలు, క్యాప్ పెట్టకుండా మొత్తం పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### రూ.22 వేలు నష్టం..



నేను ఆరెకరాల్లో సోయా సాగు చేశా. ఎకరాకు 10 క్వింటాళ్లకు పైగా వచ్చింది. ఆరెకరాల్లో 65 క్వింటాళ్ల పంట తీశా. ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు సోయాను అమ్మకానికి తీసుకొచ్చా. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎకరాకు ఆరున్నర క్వింటాళ్లు మాత్రమే తీసుకుంటామని కొనుగోలు కేంద్రం సిబ్బంది అంటున్నారు. ఈ లెక్కన నేను 40 క్వింటాళ్ల పంటను మాత్రమే విక్రయించే అవకాశం ఉంది. మిగిలిన ఉత్పత్తులను ప్రైవేటు వ్యాపారులకు అమ్మాలి. సర్కారు నిర్ణయంతో రూ.22 వేలు నష్టపోవాల్సి వస్తున్నది.

**- రాము, ఖోడద్, తలమడుగు**

### 15 క్వింటాళ్లు మిగులుతుంది



నాలుగెకరాల్లో సోయా వేశా. 40 క్వింటాళ్ల పంటను ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు తీసుకొచ్చా. ఇక్కడ ఎకరానికి ఆరున్నర క్వింటాళ్లు మాత్ర మే కొంటామని అంటున్నారు. ఈ లెక్కన ఇంకా 15 క్వింటాళ్లు మిగులుతుంది. ప్రైవేటు వ్యాపారులకు అమ్మితే రూ.14 వేల నష్టం వస్తుంది. మార్కెటింగ్ సిబ్బంది 13 శాతం తేమ ఉన్నా పంటను తీసుకోవడం లేదు.

**- తిరుమలేశ్, తంతోలి, ఆదిలాబాద్ రూరల్ మండలం**



చిట్యాల వద్ద మంటల్లో దగ్ధమవుతున్న లారీ

## బ్రిడ్జిని ఢీకొట్టిన లారీ.. పేలిన డీజిల్ ట్యాంకు

- మంటలు చెలరేగి దగ్ధం
- జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం

చిట్యాల, అక్టోబర్ 11 : సిమెంటు లారీ బ్రిడ్జిని ఢీకొట్టడంతో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన శుక్రవారం ఉదయం నల్లగొండ జిల్లా చిట్యాలలో 65వ జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ వైపు నుంచి సిమెంటు లోడ్ లారీ హైదరాబాద్ వైపు వెళ్తున్నది. ఆ లారీ చిట్యాలలోని రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిని దాటిన తర్వాత ఉన్న బ్రిడ్జిని ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ డీజిల్ ట్యాంకు బ్రిడ్జికి తగిలి పేలిపోవటంతో మంటలు చెలరేగి లారీ దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. రోడ్డుపై లారీ దగ్ధం కావడంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దాంతో పోలీసులు ట్రాఫిక్‌ను ఒకే వైపు మళ్లించి, దగ్ధమైన లారీని అడ్డు తొలగించారు. ఈ ఘటనపై ఫిర్యాదు రానందున కేసు నమోదు చేయలేదని ఎస్సై తెలిపారు.

## వీఎన్ఈఎస్ లైసెన్స్ రద్దు

**యాజమాన్యం సందేశాలకు స్పందించొద్దు : మహబూబ్ కాలేజ్**

హైదరాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): వెంకట్ నారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీ (వీఎన్ఈఎస్) లైసెన్సును రద్దు చేసినట్టు మహబూబ్ కాలేజ్(మల్టీ పర్పస్ హైయర్ సెకండరీ స్కూల్ సొసైటీ) శుక్రవారం ప్రకటనలో వెల్లడించింది. స్వామి వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎస్‌వీఐటీ), స్వామి వివేకానంద పీజీ కాలేజ్(ఎస్‌వీపీజీ), బాల్టన్ స్కూల్ వంటి విద్యాసంస్థలు ఇప్పటివరకు వీఎన్ఈఎస్ ఆధ్వర్యంలో నడిచాయని, ప్రస్తుతం తమ నియంత్రణలోకి తీసుకున్నట్టు మహబూబ్ కాలేజ్ తెలిపింది. ఈ విషయంపై హైకోర్టును ఆశ్రయించగా అనుకూలంగా తీర్పు వచ్చినట్టు పేర్కొన్నది. వీఎన్ఈఎస్ అధ్యక్షుడు డాక్టర్ కేవీకే రావు, ఆయన కుమారుడుకే శ్రీహర్ష శశాంక్, సభ్యుల జోక్యం, బెదిరింపుల కారణంగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సి వచ్చినట్టు మహబూబ్ కాలేజ్ తెలిపింది. విద్యార్థులు, తల్లిదండ్రులు, బోధన, బోధనేతర సిబ్బంది వీఎన్ఈఎస్ సభ్యుల నుంచి వచ్చే సందేశాలకు స్పందించొద్దని సూచించింది.

# ఉన్నత ప్రమాణాలతో నాణ్యమైన విద్య



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం



భూమి పూజ చేస్తున్న మంత్రి తుమ్మల



శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి

- ప్రపంచస్థాయికి ఎదిగేలా మన విద్యార్థులను తీర్చిదిద్దుతాం: భట్టి
- 'యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు' విప్లవాత్మకం: తుమ్మల
- రాష్ట్రంలో ఒక్కరోజే 29 పాఠశాలలకు శంకుస్థాపనలు: పొంగులేటి
- బోనకల్లు, 'పాలెం', ఖమ్మం రూరల్లో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు భూమి పూజ

బోనకల్లు/రఘునాథపాలెం/ఖమ్మం రూరల్, అక్టోబర్ 11 : అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యమైన విద్య అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పేర్కొన్నారు. మన విద్యార్థులను ప్రపంచ స్థాయి మానవ వనరులుగా తయారు చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. 'యంగ్ ఇండియా' పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలల్లో భాగంగా ఖమ్మం జిల్లాలో మూడు స్కూళ్ల నిర్మాణాలకు శుక్రవారం శంకుస్థాపనలు జరిగాయి. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు తమ సొంత నియోజకవర్గాల్లోనే వీటిని ఏర్పాటు చేసుకున్నారు. మధిర నియోజకవర్గంలోని బోనకల్లు మండలం గోవిందాపురం (ఎల్) గ్రామంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, ఖమ్మం నియోజకవర్గంలోని రఘునాథపాలెం మండల కేంద్రంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్లులో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ రెసిడెన్షియల్ స్కూళ్ల భవన నిర్మాణాలకు భూమిపూజ చేశారు.

**విద్యార్థులను తీర్చిదిద్దుతాం: భట్టి**

బోనకల్లులో డిప్యూటీ సీఎం విక్రమార్క మాట్లాడుతూ.. ప్రపంచంతో పోటీపడే విధంగా మన విద్యార్థులను తయారు చేసేందుకు తమ ప్రభుత్వం పాటు పడుతోందని అన్నారు. ఇందుకోసం దసరా పండుగ రోజున రాష్ట్ర వ్యాప్తంగా 28 పాఠశాలలకు శంకుస్థాపన చేయాలని నిర్ణయించుకున్నామన్నారు. ఈ మేరకు షాద్‌నగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, తన నియోజకవర్గంలో తాను, తమ తమ నియోజకవర్గాల్లో మంత్రులు ఈ శంకుస్థాపనలు చేపట్టినట్లు వివరించారు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి ఈ పాఠశాలలను పూర్తి చేసి విద్యార్థులు వీటిలో చదువుకునేలా ఆదేశాలు జారీ చేశామన్నారు.

**విప్లవాత్మక నిర్ణయం: తుమ్మల**

రఘునాథపాలెంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. తెలంగాణ విద్యార్థులను ప్రపంచ దేశాలతో పోటీ పడే స్థాయికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల' నిర్మాణాలకు తమ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అన్నారు. అంతేగాక 131 దేశాల్లో ఉన్నటువంటి ప్రముఖ శ్రీస్వామినారాయణ్ ఇంటర్నేషనల్ స్కూల్ కూడా రఘునాథపాలెంలోనే నిర్మాణం కాబోతున్నట్లు చెప్పారు. అలాగే, రాష్ట్రంలో గంజాయిపై తమ ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందని అన్నారు. రూ.2 లక్షల పైన రుణం ఉన్న రైతుల కోసం మొత్తం రూ.31 వేల కోట్లు విడుదల చేయనున్నట్లు చెప్పారు.

**29 పాఠశాలలకు శంకుస్థాపనలు: పొంగులేటి**

ఖమ్మం రూరల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో విద్యను అందించేందుకు తమ ప్రభుత్వం సంకల్పించిందని అన్నారు. ఇందుకోసం ఒక్కో చోట 25 ఎకరాల సువిశాల ప్రాంగణంలో రూ.125 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఒక్కరోజే 29 పాఠశాలల నిర్మాణాలకు తమ ప్రభుత్వం శంకుస్థాపనలు చేసిందని వివరించారు. ఇందులో భాగంగా తన నియోజకవర్గంలో తాను భూమిపూజ చేయడం సంతోషంగా ఉందని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ రఘురాంరెడ్డి, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్‌దత్, శిక్షణ కలెక్టర్ మృణాల్, కార్పొరేషన్ల చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యం, జిల్లా అధికారులు సన్యాసయ్య, సోమశేఖర శర్మ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టు పార్టీ ఏరియా కమిటీ సభ్యుడి అరెస్ట్

కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 11: మావోయిస్టు పార్టీకి చెందిన భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు డివిజన్ ఏరియా కమిటీ సభ్యుడు మడకం కోసయ్య అలియాస్ సుక్రామ్‌ను జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. భద్రాద్రి ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజు శుక్రవారం ఓ ప్రకటనలో వివరాలు వెల్లడించారు.


చర్ల మండలం-పూసుగుప్ప మార్గమధ్యంలో పోలీసులు ఉదయం వాహన తనిఖీలు చేపట్టగా పోలీసులను చూసి ఓ వ్యక్తి పారిపోయేందుకు యత్నించగా.. అతడిని వెంబడించి అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. మావోయిస్టు పార్టీ డివిజన్ ఏరియా కమిటీ సభ్యుడు మడకం కోసయ్య అలియాస్ సుక్రామ్‌గా పోలీసులు గుర్తించారు. చర్ల మండలం కొండవాయికి చెందిన కోసయ్య 2018లో చర్ల మిలీషియా కమాండర్ సోడి జోగయ్య సమక్షంలో మావోయిస్టు పార్టీలో చేరాడు. ఏడాదిపాటు మిలీషియాలో పని చేసిన తర్వాత 2019లో చర్ల ప్లాటూన్ సభ్యుడిగా చేరాడు. అనంతరం టెక్నికల్ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ అయి అప్పాసి నారాయణ అలియాస్ రమేశ్‌కు గార్డుగా పనిచేశాడు. 2024లో కోసయ్య ఏరియా కమిటీ సభ్యుడిగా పదోన్నతి పొందాడు. 2019లో చర్ల మండలం బెస్త కొత్తూరుకు చెందిన నల్లూరి శ్రీనివాస్‌ను మావోయిస్టులు అపహరించి ఛత్తీస్‌గఢ్‌లో హత్య చేసిన ఘటనలో కోసయ్య పాల్గొన్నాడని, ఆరేళ్లలో అనేక నేర ఘటనల్లో పాల్గొన్నాడని ఎస్పీ వివరించారు. అతడి నుంచి 5 కేజీల బరువు గల ల్యాండ్ మైన్‌ను స్వాధీనం చేసుకొని, కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు

# డీడబ్ల్యూవో కుర్చీ ఎవరిదో..?

- పోటాపోటీ పడుతున్న ఆ ఇద్దరు మహిళా అధికారులు
- పైరవీల కారణంగా నిలిచిపోయిన పోస్టింగులు
- భద్రాద్రిలో ఉత్కంఠ రేపుతున్న ఉద్యోగోన్నతుల ప్రక్రియ



డీడబ్ల్యూవో ఆఫీస్

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ) : జిల్లా మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి కుర్చీ కోసం ఆ ఇద్దరు అధికారులు పోటాపోటీ పడుతున్నారు. అసలే కాంగ్రెస్ సర్కార్‌లో పైరవీలకు కొదవలేదనే విమర్శలు ఆది నుంచే ఉన్నాయి. మంత్రుల పైరవీల కారణంగా జిల్లా సంక్షేమ శాఖ అధికారుల ఉద్యోగోన్నతుల పీట ముడి ఇంకా వీడలేదు. దీంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి డీడబ్ల్యూవోలుగా ఉద్యోగోన్నతులు పొందిన ఇద్దరు సీడీపీవోలకు నెల రోజులైనా ఉత్తర్వులు చేతికిరాలేదు. పూర్తి వివరాల్లోకెళ్తే.. గత నెల 11వ తేదీన బూర్గంపాడు సీడీపీవో ప్రమీల, కొత్తగూడెం సీడీపీవో లెనీనాకు డీడబ్ల్యూవోలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు మెయిల్ ద్వారా సంబంధిత కార్యాలయాలకు వచ్చాయి. అయితే వీరితోపాటు మరికొందరికి కోరుకున్నచోట పోస్టింగ్‌లు ఇచ్చేందుకు ఖమ్మం, ములుగు, వరంగల్ జిల్లాల మంత్రులు చక్రం తిప్పారు. దీంతో మొదటిగా ఖమ్మం డీడబ్ల్యూవోగా లెనీనా, హనుమకొండ డీడబ్ల్యూవోగా ప్రమీలకు ఆర్డర్లు వచ్చాయి. కానీ.. హనుమకొండ జిల్లాలో జాయిన్ కావడానికి ప్రమీల ఆసక్తి చూపలేదు. మరోవైపు ఖమ్మంలో డీడబ్ల్యూవోగా మరో అధికారి ఉండడంతో లెనీనా జాయిన్ కావడం సాధ్యపడలేదు. ఇటీవల రెండో కౌన్సిలింగ్‌లో ఒకరికి పెద్దపల్లి, మరొకరికి భద్రాద్రి ఇచ్చేందుకు అధికారులు రాజీ కుదిర్చారు. కానీ.. అందులో ఒకరు మళ్లీ మంత్రి వద్దకు వెళ్లి చక్రం తిప్పడంతో పోస్టింగుల ఫైల్ సచివాలయంకే పరిమితమైంది. భద్రాద్రి పోస్టింగ్ కోసం ప్రయత్నం చేస్తున్న అధికారుల్లో ఒకరికి భార్యాభర్తల ఉద్యోగుల వెసులుబాటు ఉండడంతో అధికారులు ఏం చేయాలో పాలుపోక మిగతా వారందరికీ పోస్టింగ్‌లు ఇచ్చి ఆ ఇద్దరికి మాత్రమే పోస్టింగ్‌లు ఇవ్వకుండా నిలిపివేశారు. దీంతో భద్రాద్రి డీడబ్ల్యూవో కుర్చీ హాట్‌టాపిక్‌గా మారింది. ఈ విషయమై జేడీ సునందను వివరణ కోరగా.. త్వరలోనే సచివాలయం నుంచి ఉత్తర్వులు వస్తాయని తెలిపారు.





